


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సంధ్యా సమస్యలు

**నమ్రత ఇంట్లోకి** అడుగుపెడుతూండగానే తండ్రి కోపంగా అరిచాడు.

"ఎక్కడికెళ్ళావమ్మా? కాలేజ్ అవగానే ఇంటికి రాకుండా ఎక్కడ తిరుగుతున్నావ్? అసలే పరిస్థితులు బాగాలేవు. ఎంత టెన్షన్‌గా ఉన్నానో తెలుసా? అసలు నీకు కాలేజ్ ఉందా?"

నమ్రత తండ్రివైపు ఆశ్చర్యంగా చూసింది. ఆయన ఆ సమయంలో ఇంట్లో ఉండడం ఒక ఆశ్చర్యం ఐతే, ఆయన అలా కోప్పడటం మరో ఆశ్చర్యం.

చేతికున్న గడియారం చూసింది. మధ్యాహ్నం రెండున్నర.

"కాలేజ్ లేదు నాన్నా. ఎప్పుడు తెరిచేది ఫోన్‌లో ఇన్‌ఫాం చేస్తామన్నారు. అంతా కలిసి ఓ ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాం. కొద్దిసేపు కబుర్లు చెప్పుకుని వచ్చాం. ఏమైంది? నువ్వు ఈ టైములో ఇంట్లో ఉన్నావేంటి? అర్జెంట్ అయితే ఫోన్ చెయ్యొచ్చుగా?"

"ఫోనా? నువ్వు ఏ లోకంలో ఉన్నావ్?"

నమ్రత అనుమానంగా ఫోన్ వంక చూసింది. సిగ్నల్స్ లేవు. ఇంటర్నెట్ కూడా లేదు.

తండ్రి వంక అపనమ్మకంగా చూసింది.

"నువ్వు సమయానికి రాకపోతే ఏం చెయ్యాలి? నీకోసం ఎక్కడ వెదకాలి అని ఎంత కంగారుగా ఉందో తెలుసా?"

"నమ్మూ వచ్చిందా కుమార్?" లోపలనించి సుజాత గొంతు వినిపించింది.

నమ్రత తల్లి గదిలోకి వెళ్ళి మరోసారి ఆశ్చర్యపోయింది. డ్రెసర్, అలమర్లు బార్లా తీసి ఉన్నాయి. మంచం మీద సూట్‌కేస్‌లు పరిచి వున్నాయి. సుజాత కళ్ళు తుడుచుకుంటూ డ్రెసర్‌లోని నగలపెట్టెలని స్ట్రోలర్‌లో సర్దుతోంది.

"ఏమైందమ్మా? ఇండియాలో ఎవరికైనా బాలేదా? నువ్వు వెళ్తున్నావా?" నమ్రత ఆందోళనగా అడిగింది.

"ఇండియాకేం శుభ్రంగా ఉంది. 'పోతున్నాం' అంటే 'సరే' అంటుంది. 'వస్తున్నాం' అంటే 'రా' అంటుంది. మనిషి చంద్రమండలానికి వెళ్ళినా మళ్ళీ మాతృభూమి మీద కాలుపెట్టాల్సిందే" సుజాత అలమరలోని విలువైన దుస్తుల్ని సూట్‌కేసులో సర్దసాగింది.

"ఏమైందంటే వేదాంతం చెప్తావేంటి? సరిగ్గా చెప్పు" నమ్రత కోపంగా అరిచింది.

"కాలేజ్ చదువులే కాదు కొంత లోకజ్ఞానం కూడా ఉండాలి బేబీ. వార్ డిక్లేర్ చేసారు. మనందరం ప్రాణాపాయంలో ఉన్నాం. ఇండియన్ గవర్నమెంట్ మనకోసం స్పెషల్ ఫ్లయిట్స్ నడుపుతోంది. ఆరింటికల్లా ఏర్‌పోర్ట్‌లో ఉండాలి. త్వరగా నీ వసువులన్నీ సర్దుకో" కుమార్ అసహనంగా చెప్పాడు.

"అవునా? మళ్ళీ ఎప్పుడు వెనక్కి వస్తాం?" నమ్రత అయోమయంగా అడిగింది.

"ఇంకెక్కడ వెనక్కి ఇక్కడ ఏం మిగులుతుంది? ఈ దేశంలో ఒక్కళ్ళు కూడా మిగిలేట్టు లేరు. నాన్న కంపెనీ మూసేసారు. అంతా సర్వనాశనం. నీ జ్యుయలరీ అంతా హేండ్ బేగ్‌లో పెట్టు. మామూలు బట్టలు వదిలెయ్. అల్మైరాలోని క్రొకరీని జాగ్రత్తగా పేక్ చేసి సర్దు. నీ పుస్తకాలు అక్కడ పనికిరావేమో. సర్టిఫికెట్స్ అన్నీ జాగ్రత్తగా పెట్టుకో. టైమ్ లేదు. నాలుగు గంటలకల్లా బయలుదేరాలి" సుజాత హడావిడిగా చెప్పింది.

నమ్రత యాంత్రికంగా తన గదిలోకి వెళ్ళింది. ఆమె చేతులు పనిచేస్తున్నా మనసు మొద్దుబారిపోయింది. యుద్ధం వస్తోందా? మరి అనార్ ఏమవుతాడు? ఇప్పుడేగా అతనితో కాలనీ అంతా కారులో తిరిగింది? 'హిజాబ్, పర్దాలలో నన్నెవరూ గుర్తుపట్టలేరులే' అని ఎంత ధీమాగా చెప్పింది? చివరిసారి వీడ్కోలు కూడా చెప్పలేదు. అతనూ దేశ పరిస్థితులని తనతో చెప్పలేదు. 'మళ్ళీ కలుద్దాం' అని ఎంత అమాయకంగా అనుకున్నారు తామిద్దరు!

"సర్దడం ఐపోతే స్నానం చేసి రెడీ అవు బేబీ. ఈలోగా నేను లగేజ్‌ని కార్లో సర్దుతాను" కుమార్ హాల్లోంచి అరిచాడు.

నమ్రత చేతిలో బేక్‌పేక్‌తో బయటికి వస్తూ ఇల్లంతా తిరిగి చూసింది. అతి శుభ్రాన్ని పాటించే తల్లి ఇంటిని యుద్ధరంగంగా మార్చి, విలువైనవన్నీ పెట్టెల్లో దాచి కళ్ళు తుడుచుకుంటూ కారెక్కి కూర్చుంది. మిస్సైల్స్ వచ్చి పడేలోపల దేశం వదిలి వెళ్ళాలని తండ్రి ఆత్రుతపడుతున్నాడు. బయటకి రాగానే కుమార్ ఇంటికి తాళం వేసాడు.

కాలనీలోని ప్రతి ఇల్లు కోలాహలంగా ఉంది. అందులో స్థానికులు ఎవరూ ఉండరు. బయట దేశాలకి చెందిన కెమికల్ ఇంజనీర్లు, ఇతర మేధావులు ఇక్కడి ఆయిల్ రిఫైనరీల్లో పనిచేయడానికి వచ్చి, కంపెనీ ఇచ్చిన ఈ క్వార్టర్స్‌లో

ఉంటున్నారు. వాళ్ళంతా హడావిడిగా ఇంట్లోకి, కార్ల దగ్గరకి తిరుగుతున్నారు. 'ఏర్‌లైన్స్ వాళ్ళు ఒప్పుకుంటే, వాళ్ళు ఇంట్లోని సమస్తాన్ని పేక్ చేసి తీసుకెళ్ళేవాళ్ళే' అనుకుంది నమ్రత. చిన్నపిల్లలు ఏమైందో అర్థంకాక అయోమయంగా చూస్తున్నారు.

వెనక సీట్ కూడా సామాన్లతో నిండిపోయింది. నమ్రత వాటి పక్కన ఇరుక్కుని కూర్చుని తమ కాలనీని చివరిసారి చూసింది. కుమార్ చెక్‌పోస్ట్ దగ్గర ఆగి, సెక్యూరిటీగార్డ్‌కి ఇంటి తాళంచెవులు ఇచ్చి, అతనితో కరచాలనం చేసి వచ్చి మళ్ళీ కార్ స్టార్ట్ చేసాడు.

నమ్రత హృదయం బరువుగా ఉంది. అనార్‌తో పరిచయమై ఆరు నెలలైంది. స్త్రీ పురుష స్నేహాలని నేరంగా భావించే ఆదేశంలో వాళ్ళిద్దరూ అనేకసార్లు అతని కారులో ఊరంతా తిరుగుతూ కబుర్లు చెప్పుకునేవాళ్ళు. ఎన్ని కలలు! ఎన్ని ఆశలు!!

అనార్ వాళ్ళ నాన్న డాక్టర్. అనార్‌కి కూడా మెడిసిన్ చదవాలని ఉంది. ఏడాది చదివాక తనవల్ల కాదని వదిలేసాడు. అప్పుడే నమ్రత పరిచయమైంది. అతనికి కెరీర్ మీద ఇంట్రెస్ట్ లేదు. చిన్నప్పటినించి చదువు, మంచి ఉద్యోగం, బోలెడు డబ్బు అనే మాటలు జీర్ణించుకుపోయిన నమ్రతకి అతని ప్రవర్తన విడ్డూరంగా ఉండేది. 'అదే మా అమ్మయితేనా?' అని ఆశ్చర్యపడేది. అనార్‌లోని స్వచ్ఛమైన ప్రేమ, అతని నిష్కల్మషమైన మనస్థత్వం ఆమెని అతనికి దగ్గరచేసాయి.

నమ్రత మరోసారి చేతిలోని ఫోన్ వంక చూసింది. సిగ్నల్స్ లేవు. మౌనంగా కిటికీలోంచి బయటకి చూడసాగింది. ఏర్‌పోర్ట్‌కి వెళ్ళే దారులన్నీ రద్దీగా ఉన్నాయి. ఎడారిలో డాలర్ల పంట కోసుకుందామని వచ్చిన హాలికులు(రైతులు) కుటుంబాలతో స్వదేశానికి బయలుదేరారు. నమ్రతకి అంత బాధలో కూడా నవ్వొచ్చింది. అవును మరి. అన్నిటికన్నా ప్రాణం ముఖ్యం.

ఏర్‌పోర్ట్‌కి కిలోమీటర్ దూరంలోనే కారుని ఆపేసారు. కుమార్ కారు దిగి అక్కడి సైనికుడితో మాట్లాడాడు.

"ఏర్‌పోర్ట్ దారంతా కిక్కిరిసిపోయింది. అంతా తమ కార్లని అడ్డదిడ్డంగా వదిలేసి పోతున్నారు . ప్రైవేట్ కార్లని అలౌ చేయడంలేదు. ఏర్‌పోర్ట్ బేటరీ కార్లు వస్తాయి. కారు దిగి లగేజ్‌ని బయటపెట్టండి" అతను చెప్పాడు.

కుమార్, నమ్రత కారులోని పెట్టెలని కిందకి దింపాక రోడ్ పక్కన పెట్టి నుంచున్నారు. దూరంగా ఆకాశంలో పొగలు.

సంధ్యాసమయం. సూర్యుడు ఎర్రగా ప్రతిబింబిస్తున్నాడు. ఒకతను వచ్చి కుమార్ దగ్గర కీ ఫాబ్ తీసుకుని కారుని తీసుకెళ్ళాడు.

"అయ్యో ఎక్కడికి తీసుకెళ్తున్నాడు?" సుజాత ఆదుర్దాగా అడిగింది.

కుమార్ నిర్వేదంగా నవ్వాడు.

"కారుని సూట్‌కేస్‌లో పెట్టి తీసుకెళ్ళలేముగా?"

"ఇలాంటి కారుని మనం ఇండియాలో కొనుక్కోగలమా? కోటి రూపాయలపైన ఉంటుంది. దేవుడా" సుజాత కళ్లల్లోంచి జలజల నీళ్ళు కారాయి.

తల్లి మనస్థత్వం గురించి తెలిసిన నమ్రత ఆమెని ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఎర్రటి సూర్య బింబంలో ఆమెకి అమాయకంగా నవ్వే అనార్ కనిపిస్తున్నాడు. 'తను జీవితంలో మళ్ళీ అతన్ని చూడగలుగుతుందా? అమ్మ చెప్పినట్లు ఈ దేశంలో ఒక్కరు కూడా మిగలరా? మరి అనార్?' నమ్రతకి దుఃఖం వచ్చింది.

'దేవుడా! అతన్ని మళ్ళీ చూడకపోయినా ఫర్వాలేదు. అతను నన్ను అపార్థం చేసుకున్నా పర్లేదు. కానీ అనార్‌ని, అనార్ కుటుంబాన్ని రక్షించు. ఊహూ, ఇన్నాళ్ళూ మాకు ఆశ్రయమిచ్చిన ఈ దేశాన్ని, ఈ దేశంలోని ప్రతి ఒక్కర్నీ కాపాడు" కళ్ళు మూసుకుని మౌనంగా ప్రార్థించింది.

కుమార్ మండుతున్న సూర్యుడి వైపు అసహనంగా చూస్తున్నాడు. ఇండియా వెళ్ళాక ఏం చేయాలి? ఈ వయసులో తనకి ఉద్యోగం దొరుకుతుందా? రాకపోతే తన సేవింగ్స్‌తో బతకగలరా? నమ్రత పెళ్ళి ఎలా చేయాలి? ఎక్కడ సెటిల్ అవ్వాలి? పోనీ పొలం కొనుక్కుని వ్యవసాయం చేసుకుందామంటే డబ్బాశగల సుజాత ఒప్పుకుంటుందా? వెళ్ళిన రోజునించి ఉద్యోగం చూసుకోమని తనని పీక్కు తినదూ? అతనికి నిస్సహాయతతో కోపం వచ్చింది.

"భగవంతుడా! నడివయసులో నాకీ సమస్యలేమిటి? పాతికేళ్ళ వయసులో చేయగలనుకాని ఏభై దాటాక ఈ పోరాటం చేయలేను స్వామీ. ఇండియాలో నాకో ఉద్యోగం దొరికేలా చూడు" మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకున్నాడు.

బేటరీ కార్ వచ్చి వాళ్ళ ముందు ఆగింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments